# ఆశ

ఉన్నట్టుండి భోరున వర్షం కురిసింది....అందాకా శుభ్రంగా ఆకాశం తెల్లగా మిలమిలలాడింది. ఆ క్షణంలో అంత పెద్దవాన వస్తుందని ఎవరూ అనుకుని ఉండరు. ఆ ఉద్దేశంతోనే మూట చంకన పెట్టుకుని బయలుదేరింది, తను, ఎక్కడికి వెళ్ళాలో తెలియదు. అయినా వూరు చేరాలంటే బీడుపడిన ఆ ఖాళీ మైదానం దాటి రెండుమైళ్ళు పోతేనేగాని లాభంలేదు. ఆత్రోవే పట్టింది.

అప్పుడు సాయంత్రం నాలుగవుతుందేమో! ఎండ ఇంకా తీవ్రంగానే కాస్తోంది! మైదానం సగం దాటేవరకూ, కారుమబ్బులు ఎటునించి ముంచుకు వచ్చిందీ, తనకు తెలియనే లేదు. తలవంచుకొని తనసంగతే ఆలోచించుకొంటూ నడుస్తోంది! నడవగా, నడవగా ఈకాస్తదూరం అయిపోతుంది! ఊరు వస్తుంది! ఆ తరువాత ఏమవుతుందో! ఆ ప్రశ్నే తేలడం లేదు, ఆలోచించినా!

ఉన్నట్టుండి ఉరుములతో, మెరుపులతో, వడగండ్లతో ధనధనా పడింది వాన. అంతకు ముందు సన్నతుంపరకూడా లేదు. ఆ మైదానంనిండా ఉన్నవల్లా ముళ్ళపొదలే! సగం సగం ఎత్తు పెరిగి గుమ్మటాల్లాగ కాళ్ళకు, కొంగులకు అడ్డు తగులుతూ ఉంటాయి. అంతేకాని ఎండా, వానకు ఆశ్రయమిచ్చి ఆదుకునేవి కావు. దూరాన ఏదో ముళ్ళచెట్టే కొంచెం ఎత్తుగా ఉన్నట్లు కనిపించింది. దానికింద కాస్సేపు నిలబడితే

కనీసం తలతడువదేమో! గబగబా ఒక్క పరుగున అక్కడకు వెళ్ళింది. ఎంత ఆతృత! కాస్త తడిస్తే ఏమో! ఏమి మమ కారాలు! పూర్తిగా మునిగిపోతూన్నప్పుడుకూడా దెబ్బ తగులుతుందేమోనని తల ప్రక్కకు తిప్పుకుంటాం!

పమిటకొంగుతో వళ్ళూ ముఖమూ తుడుచుకొని ప్రక్కకు చూచింది. ఆ చెట్టు మొదట్లో అదివరకే ఒక ముసలమ్మ కూర్చుని ఉంది. ఎర్రమట్టిరంగు చీర, చాలీ చాలనిది కట్టుకుని ఉన్నది. ఆమె ముఖంమీది ముడతలనుబట్టి చెప్పాలంటే, ఆమె వయస్సు అనంతం అనొచ్చు. చూపు ఆనదు కాబోలు! నుదుటిమీద చెయ్యిపెట్టుకొని పరికించి పరికించి చూస్తోంది. చూసి చూసి అన్నది, ఏదో ఆలోచించి ఆలోచించి గొప్ప సత్యం బయటపెట్టినట్లు—

"మంచి వాన" అని.

"ఊ" అన్నది తను. అంటూనే చేతిలో మూట క్రింద పడవేసి దానిమీద కూర్చున్నది. ఆమె ప్రక్కనే, అక్కడే ఓపికతో రోజంతా ముండ్లచెట్లన్నీ విరిచి, మూటకట్టిన పుల్లల మోపు ఉన్నది. ఆ అవ్వ తనదగ్గరఉన్న ఒక్క పాతబట్ట దాని మీద కప్పింది, ఎంతో పదిలంగా! చలితో వణకిపోతున్నా తను కప్పుకోలేదు. అవి ఆమెకు ఎంత ప్రియమైనవో!

"ఈ పుల్లలు నీవేనా?" అన్నది తాను—నడుము వంగి ఎముకలు బయటపడినవి, అన్నిపుల్లలు ఎట్లావిరిచింది, ఎట్లా మోసుకు వెడుతుందీ అనుకుంటూ.

"నావె. రోజట్టుకెళ్ళి బామ్మలింటో యిస్తాను, రెండణా లిత్తారు" అన్నది అవ్వ.

"రోజూ వస్తావూ! ఎంత ఓపిక! రెండణాల కోసం ఎందుకీ యవస్థ? ఎవరూ లేరామేం నీకు" అన్నది తను ఆశ్చర్యంగా

"లేకేం! ఉండారులే!" అంది అవ్వ విసుగ్గా, విరసంగా.

తను మళ్ళీ తరిచి అడుగలేదు. ఎవరో ఉంటారు! ఎందుకు ఉండరూ! తనకు లేరూ! పింతల్లి కూతుళ్ళూ, పెత్తల్లి కొడుకులూ, మేనత్త మనమలూ, ఇంకా ఎవరో! ఏమూలల ఎవరున్నదికూడా, సరిగా తెలీకుండా! ఎవరుండీ ఏమి లాభము? మనిషి బ్రతికినన్నాళ్ళూ తనఖర్మ తననుభవించవలసిందే! బ్రతికి ఉన్నంతవరకూ ఏపుల్లలేరో, గడ్డి డ్రోకో ఎల్లాగో పొట్టనింపుకోవాలి. అదీ తప్పదు!

తనకు ప్రొద్దుటిసంగతి గుర్తుకు వచ్చింది. ఆవేళ ప్రొద్దున్నే ఆరింటికే కబురంపించింది వార్డెనమ్మ. అప్పటికి అది ఆరోసారి ఆమె కబురుచేయడం. ఎందుకు పిలుస్తోందో తనకూ తెలుసు. వెళ్ళక తప్పదు కాబట్టి తను వెళ్లింది. తన్ను చూస్తూనే సౌమ్యంగానే అడిగింది ఆమె.

"ఏమమ్మా, నీవు నిన్ననే వెళ్తానన్నావుగదా! ఇంకా వెళ్ళలేదేం?" అన్నది.

"వెళ్తానండీ, ఇవ్వాళ తప్పకుండా వెళ్తాను. అన్నీ సర్దుకున్నాను" అన్నది తను, ఆలోచించుకోకుండా, ఉదాసీనంగా.

ఆవిడ మళ్ళీ అన్నది నెమ్మదిగా.

"చూడమ్మా, ఈ పరిస్థితుల్లో నిన్ను వెళ్ళమనడం తప్పే, కాని నిన్ను ఉంచుకోడానికికూడా ఇటువంటి పరిస్థితుల్లో వీలులేదు. శరణాలయంపేరు పాడైపోతుంది" అని.

తను నవ్వుకొంది. ఆమాట ఆవిడ అనేకసార్లు చెప్పింది. ఈ శరణాలయం ఎక్కడా శరణులేని తనకోసం కాదు. గౌరవమర్యాదలు కలిగి దానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురాగలిగినవారికోసమే!

వార్డెనమ్మ మళ్ళీ అన్నది.

"వెళ్ళేముందు నీసామానంతా ఓసారి చూపించి వెళ్ళమ్మా! ఎందుకైనా మంచిది" అని. ఆమాట ఆవిడ అనలేక అనలేక కష్టంగానే అన్నది.

తనకు నవ్వొచ్చింది. తను ఏమి పట్టుకుపోతుంది? ఎక్కడికి? తనమూట రెడీగానే ఉంది. వెంటనే వెళ్ళి తెచ్చి చూపింది. రెండు తెల్లచీరలూ రవికలూ, ఇంకా తను ఎప్పుడో సముద్రపు ఒడ్డున ఏరుకొన్న తెల్లని, ఎర్రని, రంగు రంగుల గవ్వలూ, మూట విప్పుతోంటే ఆ గవ్వలన్నీ జారి వార్డెనమ్మగదినిండా పడ్డాయి, గలగలా. ఆమె తెల్లపోయింది. కాని మాట్లాడలేదు. తను మళ్ళీ గవ్వలన్నీ ఒక్కొక్కటీ ఏరుకొని మూటకట్టుకున్నది. ఎందుకో! ఎప్పుడో తనకు కొడుకు పుడతాడు. వాటితో ఆడుకొంటాడు—అదీ ఆశ! ఏమో!

వార్డెనమ్మ అన్నది,

"నీసంగతి సుందరరామయ్యగారికికూడా రాశాను. నిన్ను పంపించివేస్తున్నట్లు చెప్పాను" అని, తనబాధ్యత చక్కగా నిర్వహించుకొన్నానన్న తృప్తితో నిట్టూర్చింది.

తను ఉలిక్కిపడింది. ఇంక తనకు ఆఆస్కారంకూడా లేదు. తను మళ్ళా ఆవూరు పోలేదు. బావగుమ్మంలో అడుగు

పెట్టలేదు. సుందరరామయ్యగారిముఖం చూడలేదు. ప్రపంచమంతా ఒక్కసారి శూన్యంగా కనిపించింది. ఆలోచించుకోకుండా దిగాలుపడిచూస్తూ అన్నది తను. "సాయంత్రందాకా ఉండనివ్వండి, సాయంత్రం తప్పకుండా వెళ్ళిపోతాను" అని.

అర్థంలేనిమాట! సాయంత్రంలోపల తన పరిస్థితి ఏవిధంగా మారుతుంది! అప్పుడుమాత్రం ఎక్కడికి వెడుతుందీ!

వార్డెనమ్మ బాధపడుతూ అన్నది:

"సరే. సాఘంత్రం తప్పకుండా వెళ్ళాలిసుమా! ఇంక ఆలస్యంచెయ్యటానికి వీలులేదు. ఆ! అందాకా నీమూటమాత్రం ఇక్కడే ఉండనీ! నీమంచికోసమే చెబుతున్నాను" అని.

తను మాట్లాడకుండా మూట వదిలేసి వెళ్ళిపోయింది. కష్టాలు వచ్చినప్పుడు ఎన్ని అవమానాలైనా భరించేశక్తి భగవంతుడే ఇస్తాడు!

* * *

వర్షం జోరు కొద్దిగా తగ్గుతోంది. గాలికి చెట్టు వూగి, వూగి, రాలిన ఆకులన్నీ ఒక్కసారి ఆప్యాయంగా ఒంటికంటుకుని పలకరించి పారిపోతున్నాయి! ముసలమ్మ పమిటకొంగు తలనిండా ఒంటినిండా కప్పుకొంది. ఆమెచూపులూ, వూహాలూ ఎక్కడో ఎంతోదూరాన ఉన్నాయి. ఏమాలోచిస్తోందో! లేదా ఏమీ ఆలోచించడంలేదో! ఈ వాన ఎప్పుడు తగ్గుతుందీ అనుకుంటోందేమో!

—తనకు ఈ వూరు వచ్చినరోజు గుర్తుకు వచ్చింది,

అప్పుడూ ఇల్లాగే ఒక్కతే ఒంటి మాటతోనే వచ్చింది. అయితే ఆవేళ వానలేదు. ఎండ మిలమిలా కాస్తోంది. ఊరు సందడిగా ఉన్నది. తను ముందుకు ఒక్కొక్క అడుగూ ఉత్సాహంతో వేసింది. శరణాలయం కనుక్కోడానికి ఎక్కువ సేపు పట్టలేదు. అబ్బ! అప్పుడే ఆరునెలలైంది. మొన్ననే రైలు దిగినట్లున్నది! ఒక్కత్తే.

బంధాలన్నీ ఎక్కడివక్కడే అనుకోకుండా తెగిపోతూ ఉంటాయి! అనుకోకుండానే మళ్ళీ మళ్ళీ క్రొత్తవి వెతుక్కుంటూ ఉంటాము! ముందుకు అడుగువేస్తే ఎక్కడికో! ఏమో! కాలుమాత్రం నిలవదు.

...ఆవేళ, 'అక్కయ్య పోయినరోజు, అంతా శూన్యం అనిపించింది. తను తల్లినెరుగదు, తండ్రినెరుగదు. తనకు వూహ తెలిసినప్పటినించి తనకంటియెదుట మెదలినది ఒక్క అక్కయ్య రూపమే! పచ్చని పల్చని-ముఖమూ, నల్లగా వత్తుగా ముందుకు వ్రాలిన ముంగురులూ, అరకాసంత ఎర్రని కుంకుంబొట్టూ, కదలినప్పుడల్లా చేతిగాజుల గలగల, కాలిమట్టెల చప్పుడూ! తన ప్రపంచమంతా ఇవే నిండుకున్నాయి. తనకు ఇంకొకరితో సంపర్కం అవసరం లేకపోయింది. పదహారేండ్లు వచ్చినా పసిపిల్లలాగా బ్రతికింది. ఏ మూలో చదివిన కథలే చదవడం, నిద్రపోవడం, అక్కయ్య పిలిచినప్పుడు పలకడం, అంతకన్న తనకేమీ తెలియదు. జీవితం అల్లాగే గడచి పోతుందనుకున్నది. ఒకరోజు ఇల్లా నిరాధారంగా నిలబడి, తన బ్రతుకు తెరువు తను చూసుకోవలసివస్తుందని కల్లోగూడా అనుకోలేదు!

—అకస్మాత్తుగా అక్కయ్య పోయింది. రెండురోజులు మాత్రమే జ్వరం కాసింది. అది ఎవరూ లక్ష్యపెట్టలేదు. మూడోరోజు అంతా మించిపోయింది. బావ మతిలేనివాడిలా అయ్యాడు. తనకు పరిస్థితిని అర్థంచేసుకోటానికే నాలుగు రోజులు పట్టింది. అక్కయ్య మళ్ళీ తనకీ జన్మలో తిరిగి కనిపించదని తను నమ్మలేకపోయింది. ఎక్కడో డాబామీద ఒంటరిగా పడుకొంటే, అక్కయ్య "ప్రొద్దుపోయింది. అన్నానికి రావేమే" అన్నట్టే ఉండేది.

—నాలుగురోజుల్లో ఇల్లంతా బావ బంధువులతో నిండిపోయింది. ఆ ఇంట్లో బావా, తనే పరాయివాండ్లు అయినారు. బావ ముందర గదిలో, తను డాబామీదా, ఇంట్లో విషయాలతో ఏమీ సంబంధం లేనట్లుగా, దిక్కుతోచక కూర్చునేవారు. క్రింద అందరూ ఏదో హడావిడిగా ఉండేవారు. ఏదో గుసగుసా మాట్లాడేవారు. ఒకరోజు పరధ్యానంగా తను క్రిందకు వెళ్ళింది. బావమేనత్త రామాయమ్మ పినతల్లి కుటుంబాయమ్మ మాట్లాడుకుంటున్నారు. అనుకోకుండా తను విన్నది:

"నలభై నిండలేదు. మళ్ళా పెళ్ళిచేసుకోక ఎల్లా జరుగుతుందీ!" అంటోంది రామాయమ్మ. నిట్టూర్పువిడుస్తూ అన్నది కుటుంబాయమ్మ: "ఇంట్లోనే ఉన్నదిగా, ఈడొచ్చిన మరదలు" అని.

తనగుండెల్లో రాయిపడింది. తల గిర్రున తిరిగింది. రామాయమ్మ మళ్ళీ అందుకుంది. "ఆ కన్నకూతురిలా పెంచి దాన్నెలా చేసుకుంటాడు! అయినా మరోసంబంధం

చేసుకొంటే, పాపం ఆ పిల్ల గతేమవుతుందీ! ఇక్కడెలా ఉంటుంటుంది!"

తనకళ్ళు చీకట్లు క్రమ్మాయి. తను పడిపోయింది. ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

ఆరాత్రంతా తన కదే దిగులు. కన్నతల్లిలా పెంచిన అక్కయ్య కాకుండా, తండ్రిలా ఆదరించిన బావకూడా తన కింక దూరమవుతాడు. ఒకరు లేక దూరమైతే, మరొకరు ఉండే దూరమవుతారు. ఈ ఇల్లు విడిచి ఎక్కడికి పోతుంది! ఏమీ తోచలేదు. డాబామీద ఎంతసేపు అలాగే ఏడుస్తూ పడుకున్నదో తనకే తెలియదు. ఎవరూ తన్ను పిలవలేదు. తనజోలికి రాలేదు. ఏదో దిగులు, భయం, బెంగ! ఎన్నో!

—ఉన్నట్టుండి ఎవరో తనమీద చెయివేశారు. జ్వరం వచ్చినట్లు కాలిపోతూన్న తనవంటి కది చల్లగా మంచులా తగిలింది. ఏదో హాయి కలిగించింది. తనకు తెలియకుండానే తానా చేతిని గట్టిగా పట్టుకొన్నది.

"అబ్బే! మీరిలా బాధపడితే ఎలా?" డాబాగదిలో అద్దెకున్న మురళిగొంతు. అప్పుడే వూరినించి వచ్చేడేమో! ప్రేమతో ఆప్యాయంగా తనకన్నీళ్ళు తుడిచాడు. తానా చేతిని గట్టిగా చెక్కిలి కదుముకొన్నది. ఆక్షణంలో ఎవరు తనకు దగ్గరగా వచ్చినా, దూరంగా త్రోసివేసేశక్తి తనకు లేదు. తనకు దగ్గరగా, తన్ను ఆదుకునేవ్యక్తి ఎవరో ఉన్నారన్న సంతృప్తి చాలును. ఎవరో తన్ను ప్రేమతో గుండెల కదుముకుని క్షణకాలం తనబాధ మరపిస్తే చాలును!

వారంరోజులుగా నిద్రలేని తనకళ్ళకు ఆక్షణంలో మైకంలా నిద్రకమ్మింది! అతని ఒడిలోనే నిద్రపోయిందేమో!

ఆమర్నాడు అతను కనిపించలేదు. ఆ తరువాత నెల రోజులవరకు అతను మళ్ళీ కనిపించలేదు. అతను ఏమైనదీ ఎవరినీ అడిగే సాహసం తనకు లేకపోయింది. ఈ లోపల బావ బంధువులు తన కా ఇంటిలో ఇంక స్థానంలేదని పదే పదే, సూచించారు. తనకు దిక్కు తోచలేదు. సమయానికి బావ స్నేహితుడు సుందరరామయ్యగారు సహాయపడ్డారు. ఈ శరణాలయంలో ఉద్యోగం ఖాళీగా ఉన్నదని చెప్పి పంపించారు.

*　　*　　*

వాన పూర్తిగా తగ్గిపోయింది. ముసలమ్మ మోపు తీసుకొని బయలుదేరింది. తనూ వెనకాలే వెళ్ళింది. మబ్బులు త్రోసుకొని సన్నగా చంద్రుడు కనిపిస్తున్నాడు. వెనకాలే ఒక్క నక్షత్రం నిశ్చలంగా నిర్మలంగా ప్రకాశిస్తోంది. ఆ చందమామను, నక్షత్రాన్ని చూస్తూ అడుగులు ముందుకు వేసింది, తను.

ఉన్నట్టుండి, ముసలమ్మ అడిగింది:

"ఏ పేటకు బోవాల నువ్వు?" అని.

తను నవ్వుకొన్నది.

"ఏపేట అయినా ఒక్కటే నాకు. ఎక్కడా ఎవరూ లేరు" అన్నది తను. ముసలమ్మ విస్తుపోయింది.

ఎందుకో తనరహస్యాలు ఈ అవ్వకు చెబితే ఫరవా లేదనిపించింది తనకు. తనను విమర్శించటానికిగానీ, ఆక్షేపించ

టానికిగానీ అవ్వకు తీరికా, ఓపికా రెండూ ఉండవు. అనవసరంగా అక్కరలేని కాఫీ త్రాగుతూనో, పేకాడుతూనో, అందరి సంగతి చెప్పుకొని ఆక్షేపించటానికి అదృష్టవంతులు కొందరికి మాత్రమే సాధ్యం!

"ఒక్కతైవే, యాడుంటావు?" అవ్వ మళ్ళీ అడిగింది.

ఏమో! ఎక్కడ ఉంటుందో! తనకా ఆలోచనే లేదు. ఎందుకో తనకు ధైర్యంగానే ఉన్నది. తనకు మళ్ళీ ఎక్కడైనా ఉద్యోగం దొరుకుతుంది. తనకు కొడుకుపుడతాడు. మురళి తనను వెతుక్కుంటూ వస్తాడు! ఈ కలల అంచులు పట్టుకొని తాను ప్రపంచమంతా ఒంటరిగానే తిరుగగలదు. యుగయుగాలు కనిపెట్టుకొని ఉండగలదు!

"నాకు కొడుకు పుడతాడు" అన్నది తాను, అవ్వతో ఎంతో ఉత్సాహంతో!

ముసలమ్మ గొణిగింది.

"ఆ! కొడుకు పుడతాడు! పెరిగి పెద్దోడవుతాడు. తీర్థానికిబోతే ఓ అమ్మి ఆడిని జూసి నవ్వుతాది! అంతే! నీ కొంగొదిలేసి దానికొంగుచ్చుకుంటాడు. అంతే! మళ్ళా కాళ్ళూ సేతులూ కట్టెపుల్లలే మిగల్తాయి, మనకు" అన్నది.

ఏమిటో! సొంతగొడవ కాబోలు! తనకు అర్థంకాలేదు. ముందుకు అడుగువేస్తే ఎదురుగుండా నెలవంక, ఒక్క నక్షత్రం, అంతే స్వాగతం చెపుతున్నాయి. ఎందుకో హృదయం ఆనందంతో నిండిపోయింది.